సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 25-12-2024

సంపుటి: 20 సంచిక: 231

పేజీలు: 4 వెల: రూ.1



## పశువుల దాణా తినేశారు!

- రూ.11 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మాయం
- సరఫరా చేయకుండా బిల్లుల చెల్లింపు
- డీడీ కాదంటే ఏడీలతో సంతకాలు
- టీడీపీలో బీజం.. వైకాపాలో పంపకం

కథనం 4 లో



• గెస్ట్ ఎడిటోరియల్

## ఎన్నికల కమిషన్ కూడా పంజరంలో చిలకేనా?

స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థయిన ఎన్నికల సంఘం కూడా మినహాయింపు కాదా? అన్నది ఇప్పుడు అందరి మెదళ్లనూ తొలుస్తున్న సమస్య! తన నైతిక ప్రవర్తనా నియమావళికి ఎన్నికల సంఘం ప్రతిపాదిస్తున్న సవరణలే ఈ సందేహానికి కారణం. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం(ఈసీ) మార్పులు చేయడానికి పూనుకుంది. దేశంలో ఎన్నికల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, అనుమానాలకు తావులేని విధంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తుంటే, వాటిని తుంగతోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం గోప్యతకే ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నికల ప్రక్రియను మరింత రహస్యంగా మార్చే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఒక రకంగా రాజకీయ పార్టీల హక్కులను హరించడమే అవుతుంది. దేశంలో ప్రజాస్వామిక విలువలను వమ్ము చేయడమే గాక రాజ్యాంగ వ్యవస్థల స్ఫూర్తిని కూడా దెబ్బతీస్తూ నిరంకుశ చర్యలకు పాల్పడుతూనే ఉంది ప్రభుత్వం. ఈ క్రమంలో బాహాటంగా బరితెగించి వ్యవహరించినవి కొన్నయితే, అచ్చంగా చట్టబద్ధంగా చట్టం కోసమే చేస్తున్నట్టు నటిస్తూ చాపకింద నీరులా తమ పని చక్కబెట్టుకునేవి మరికొన్ని. ఎన్నికల నిర్వహణతో పాటు పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు (సీసీటీవీ కెమెరా ఫుటేజీ, వెబ్ కాస్టింగ్ ఫుటేజీ లాంటివి), వీడియో రికార్డింగ్‌లను సామాన్య ప్రజలు తనిఖీ చేసేందుకు వీల్లేకుండా ఎన్నికల నిబంధనల్లో సవరణలు తీసుకోస్తోంది. అధికారపక్షం కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు ఈ నిషేధం విధించింది. ఇవన్నీ చూస్తుంటే ఈసీ తన స్వతంత్రతను కోల్పోతోందని స్పష్టమవుతోంది. ఎలాంటి ప్రలోభాలకూ, అనైతిక ప్రభావాలకూ, అక్రమాలకూ అవకాశమివ్వకుండా.. అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత. కానీ అవాంఛనీయమైన రాజకీయ జోక్యాలతో ఎన్నికల సంఘం డూడూ బసవన్నలా తలాడించే వారితో నిండిపోతోంది. చివరికి ఎన్నికల్లో ఆ స్వేచ్ఛా, పారదర్శకతలే కొడిగట్టిన దీపాలవుతున్నాయి. మూడో దఫా మోడీ పాలనలో అది మరింత తీవ్రమై ఎన్నికల సంఘమంటే ఏలినవారి వ్యూహాలకు గుడ్డిగా తలాడించే కీలుబొమ్మగా మారింది. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తికి సమాధి కట్టే వివాదాస్పద 'జమిలి ఎన్నికల' అంశం ఇప్పటికే జేపీసీ ముందు ఉంది. ఈ తరుణంలో ఉన్నట్టుండి ఈ సవరణకు ఉరుకులాడటం ఆశ్చర్యానికే కాదు, పలు అనుమానాలకూ, ఆందోళనలకూ గురిచేస్తోంది. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తినే సందేహాస్పదం గావిస్తోంది. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో ఉన్న అంశాలే అనేకం అమలుకు నోచుకోవడం లేదు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాలను ఈసీ నియంత్రించలేక పోతోంది. ఎన్నికల్లో కుల మత విభజనలనూ, విద్వేషాలనూ అడ్డుకట్టు వేయలేక పోతోంది. నేర స్వభావం గల నేతలను పోటి నుంచి నివారించలేకపోతోంది. తన నియంత్రణలోని అతిక్రమణలనే అడ్డుకోలేని ఎన్నికల సంఘం, తాజా నింబంధనలకు ప్రయత్నించడం అవాంఛనీయం, రాజ్యాంగ విరుద్ధం. వాటన్నిటినీ వదిలేసి ఏలినవారి ఆలోచనలకు ఊడిగం చేయడానికి వ్యవస్థలు దిగజారితే అంతకన్నా విషాదమేముంటుంది? కేంద్ర సర్కార్ తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఎన్నికల సంఘంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. భారతదేశ ఎన్నికల కమిషన్‌కు ప్రపంచంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. దాని పనితీరును ప్రపంచదేశాలు అనేక సందర్భాల్లో శ్లాఘించాయి. ఇంతటి గొప్ప నేపథ్యం ఉన్న ఎన్నికల కమిషన్‌ను మోడీ ప్రభుత్వం తమ కనుసన్నల్లో పెట్టుకోవాలని చూడటం ప్రజాస్వామ్యానికి విఘాతం. ఈసీ విధుల్లో మోడీ ప్రభుత్వం జోక్యం మానుకోవాలి. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత పెల్లుబుకుతుందనడంలో సందేహమే లేదు. కేంద్రం వ్యవస్థలను లోబరుచుకుని దొడ్డిదారిన తన ప్రయోజనాలను సాధిస్తానంటే అది ఎలా సమంజస మవుతుంది? దీనికి వంతపాడితే వ్యవస్థల స్వతంత్రతకు విలువేముంటుంది? ఇప్పటికే కొన్ని అంశాల వలన ఈసీ తన ఔన్నత్యాన్ని ప్రశ్నార్థకం చేసుకుంది. కాబట్టి, వీలైతే సమాజంలో చైతన్యానికి పాటుపడాలే తప్ప, గంగిరెద్దులా తలూపడం, ఏలికలకు వంతపాడటం వ్యవస్థలకు తగని పని. గడిచిన ఎన్నికల్లో ఈవీఎంలు చూపించే బ్యాటరీ పర్సంటేజీలు, పోలైన ఓట్లు, ఎన్నికల అధికారి ఇచ్చిన మాన్యువల్ డేటాల మధ్య వ్యత్యాసం ఉందని ఫారం 7ఎ ప్రకారం వీవీ ప్యాట్ స్లిప్‌లు లెక్కించాలని సుప్రీంకోర్టులో ఉన్న కేసులు ఇప్పుడు ఈ చట్టసవరణ ద్వారా మురిగిపోనున్నాయి. అటువంటప్పుడు ఎన్నికల వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి అనేది ఉత్తిమాటే.





## అల్విదా ఛాంపియన్!

"ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత టెస్ట్ క్రికెట్‌కి అశ్విన్ వీడ్కోలు పలుకుతాడని ఏదో మూల సందేహం ఉన్నప్పటికీ సిరీస్ మధ్యలోనే ఆ పని చేస్తాడని అసలు ఊహించలేదు. రవిచంద్రన్ అశ్విన్.. ఇతని గురించి ఎంతమంది ఎన్ని వర్ణనలైనా చేయొచ్చు. స్పిన్ మాంత్రికుడని, క్రికెట్ లెజండ్ అని, క్రికెట్ సైంటిస్ట్ అని, ఎన్నో ప్రపంచ రికార్డుల్ని తన గుప్పిట పట్టిన ఛాంపియన్ అని ఎన్నో చెప్పొచ్చు. కానీ నా దృష్టిలో అతను భారతదేశపు గ్రేటెస్ట్ మ్యాచ్ విన్నర్. ఓ క్రికెట్ క్రీడాకారుడి ఖాతాలో ఓ పది 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు ఉండటమే కష్టం. అలాంటిది అశ్విన్‌కి 11 ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులున్నాయి. ఈ ఒక్క గణంకం చాలు అశ్విన్ ఎంత గొప్ప మ్యాచ్ విన్నరో అర్థమవుతుంది."


క్రికెట్‌లో 2011 నుంచి భారత్‌ని అగ్రపథాన నిలపడంలో అశ్విన్ పాత్ర కంటే గొప్ప పాత్రని పోషించిన క్రికెటర్ మరెవ్వరూ లేరు. అశ్విన్, జడేజ కాంబినేషన్ వచ్చినప్పటి నుంచి భారత్ మీద ఏ విదేశీ జట్టుకైనా 500 పైన పరుగులు చేయాలంటే దాదాపు అసాధ్యం. ఇంత గొప్ప బౌలింగ్ జోడీ ఆడటం భారత్ క్రికెట్‌లో అరుదైన, అసాధారణ సుదీర్ఘ ఘట్టం. అశ్విన్ దగ్గరకు వస్తే 106 టెస్ట్ మ్యాచెస్‌లో 537 వికెట్లంటే అదో అసాధారణ విషయం. వర్తమాన ప్రపంచ క్రికెట్లో ఇంతటి ఘనత అందించిన బౌలర్ మరెవ్వరూ లేరు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే గొప్ప బౌలర్లు, ఆల్ రౌండర్ల సరసన ఓ లెజండ్‌గా నిలిచిపోగలిగిన వాడు మన అశ్విన్. అశ్విన్ ముందు తరంలో అనిల్ కుంబ్లే, షేన్ వార్న్ ఉన్నప్పటికీ వారి బౌలింగ్ యావరేజ్ అశ్విన్ కంటే ఎక్కువ. ఒక్క ముత్తయ్య మురళీధరన్ మాత్రమే అశ్విన్ కంటే ముందుంటాడు. అయితే మురళీధరన్, వార్న్, కుంబ్లే అశ్విన్ లా ఆల్ రౌండర్లు కాదు. అశ్విన్ టెస్ట్ క్రికెట్లో 6 సెంచరీలు, 14 ఫిఫ్టీలతో 3,500 పరుగులు చేశాడు. ఈ విషయంలో ఆ ముగ్గురూ అశ్విన్ చుట్టుపక్కల లేరు. బ్యాటింగ్‌లో కూడా అశ్విన్ చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచెస్‌ని సేవ్ చేసి, గెలిపించిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు ఆస్ట్రేలియాలో హనుమ విహారితో కలిసి అసాధారణ డిఫెన్స్‌తో టెస్టుని రక్షించాడు ఓసారి. మరోసారి బంగ్లాదేశ్‌లో అటాకింగ్ బ్యాటింగ్‌తో శ్రేయస్ అయ్యర్‌ని అవతలి ఎండ్‌లో అలా చూస్తుండగా మ్యాచ్‌ని గెలిపించాడు. ఇంక పాకిస్తాన్ మీద 2022 టి-20 ప్రపంచ కప్‌లో గొప్ప సమయస్ఫూర్తితో కోహ్లి అవతలి ఎండ్‌లో ఉండగా చివరి రెండు బంతుల్ని ఆడిన తీరు.. ఇవన్నీ క్రికెట్ అభిమానులు మర్చిపోరు. అశ్విన్ బాటింగ్ పక్కన పెట్టినా బౌలింగ్‌కి సంబంధించినంత వరకు టెస్ట్ క్రికెట్లో 37 సార్లు 5 వికెట్లు, 8 సార్లు 10 వికెట్లు తీసిన అశ్విన్ ప్రదర్శనని భారత్‌లో ఎవరైనా అధిగమించాలంటే ఇంకా కొన్ని దశాబ్దాలు పట్టొచ్చు. ఒకే టెస్టులో ఐదు వికెట్లు, సెంచరీ నాలుగు సార్లు సాధించిన ఘనత అశ్విన్‌ది. కేవలం బోథం మాత్రమే ఐదుసార్లు ఈ ఫీట్ సాధించాడు. అందుకే అశ్విన్ క్రికెట్ చరిత్రలో నిలిచిపోగల ప్రపంచస్థాయి ఆల్ రౌండర్ అని చెప్పగలిగేది. 2016లో అనుకుంటా అశ్విన్ ఐసిసి క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచాడు. అందుకే భారతదేశానికి సంబంధించినంత వరకు అశ్విన్‌ని గ్రేటెస్ట్ మ్యాచ్ విన్నర్ అనేది. ఇంత సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ, ఒక గొప్ప వ్యూహకర్త, క్రికెటింగ్ బ్రెయిన్ అనే పేరు ఉన్నప్పటికీ అశ్విన్ కెప్టెన్ కాలేకపోయాడు. కారణాలు రాజకీయాలు తప్ప వేరేవి ఉంటాయా? కనీసం వైస్ కెప్టెన్సీ కూడా ఇవ్వలేదు. అందుకే కనీసం ఆపద్ధర్మంగా అయినా అజింక్య రహానె, బుమ్రాలు కెప్టెన్లు కాగలిగారు కానీ అశ్విన్ కాలేకపోయాడు. ఇది బీసీసీఐలో నార్త్ లాబీయింగ్ ప్రభావమే అనుకోవాల్సి ఉంటుంది. అశ్విన్‌కి ఒక కమర్షియల్ ఫేస్ లేదు. అతను ఓ సృజనాత్మక వ్యక్తి. మంచి సెన్సాఫ్ హ్యూమర్‌తో, విశ్లేషణాత్మక సామర్థ్యంతో తన యూట్యూబ్ చానెల్స్ నడుపుతుంటాడే కానీ కోహ్లీలా కమర్షియల్ ఫేస్ లేదు. అతన్ని బ్యాక్ చేయడానికి ఎలాంటి లాబీయింగ్ లేదు. ఒక్క సిరీస్‌లో తన స్థాయిలో ఆడలేకపోయే సరికి అతన్ని పక్కన పెట్టడంతో గాయపడి వుంటాడు. అవమానంగా భావించి వుంటాడు. తన అవసరం లేనప్పుడు జట్టులో వుండటం అనవసరమని తనతో అన్నాడని కెప్టెన్ రోహిత్ చెప్పాడు. నాలుగైదేళ్ల నుంచి దారుణమైన పెర్ఫార్మెన్స్ ఇస్తున్నా కోహ్లి, రోహిత్ స్థానాలకి ఢోకా లేదు ఇన్నాళ్లపాటూ. ఈ వాస్తవం క్రికెట్ రాజకీయాలకు అద్దం పడుతుంది. ఎప్పుడో ఓసారి అశ్విన్ ఇదంతా బైటపెట్టొచ్చేమో ఓ పుస్తక రూపంలో. అల్విదా ఛాంపియన్!

– అరణ్యకృష్ణ

# కంటికి ఇంపే..మనసుకు కాదు!

తెలుగు గాత్రదానం: మహేష్ బాబు-సత్యదేవ్-అయ్యప్ప పి.శర్మ-బ్రహ్మానందం-ఆలీ-శేషు తదితరులు సంగీతం: హాన్స్ జిమ్మర్ ఛాయాగ్రహణం: జేమ్స్ లాక్స్టన్ స్క్రీన్ ప్లే: జెఫ్ నాథన్సన్ నిర్మాణం: డిస్నీ దర్శకత్వం: బారీ జెన్కిన్స్

**హాలీవుడ్ నిర్మాణ సంస్థ డిస్నీ నుంచి యానిమేషన్ సినిమా వస్తోందంటే ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అమితాసక్తితో ఎదురు చూస్తారు. ఈ చిత్రాలను పిల్లలు ఎలా కేరింతలు కొడతారో.. వాటిని చూస్తున్నపుడు పెద్దవాళ్లు కూడా పిల్లలైపోయి అంతే ఆనందపడతారు. ఇప్పుడు డిస్నీ సంస్థ నుంచి వచ్చిన కొత్త యానిమేటెడ్ మూవీ.. ముఫాసా: ది లయన్ కింగ్. రెండుసార్లు ఒకే కథతో 'ది లయన్ కింగ్' సినిమా తీసి అలరించిన డిస్నీ సంస్థ.. ఇప్పుడు దాని ప్రీక్వెల్ గా 'ముఫాసా'ను తీర్చిదిద్దింది. తెలుగులో ప్రధాన పాత్రకు మహేష్ బాబు గాత్రదానం చేయడంతో ఈ చిత్రానికి మంచి బజ్ క్రియేట్ అయింది. మరి 'ది లయన్ కింగ్' లాగే 'ముఫాసా' కూడా మెప్పించిందా.. దీని ప్రత్యేకతలేంటి.. తెలుసుకుందాం పదండి.**




### కథనం-విశ్లేషణ:

జంతువులు మాట్లాడితే.. మనలా హావభావాలు పలికిస్తే.. అవి కూడా అనుబంధాలు ఆప్యాయతలతో విరాజిల్లితే.. వాటి మధ్య కుట్రలు కుతంత్రాలు.. ఆధిపత్య పోరాటాలు సాగితే.. ఇలాంటి ఊహలకే రూపం ఇచ్చి యానిమేషన్లో అద్భుతాలు చేస్తుంటారు హాలీవుడ్ ఫిలిం మేకర్స్. తెరపై జంతువులు మనలా మాట్లాడుతుంటే.. హావభావాలు పలికిస్తుంటే చూడ్డం గమ్మత్తుగా ఉంటుంది. అందులోనూ మనకు బాగా పరిచయం ఉన్న ఆర్టిస్టులు ఈ యానిమేటెడ్ సినిమాల్లో జంతువుల పాత్రలకు గాత్రదానం చేస్తే అది ఇంకా గమ్మత్తుగా అనిపిస్తుంది. 'ముఫాసా'లో ప్రధాన పాత్రకు మహేష్ బాబు వాయిస్ ఇవ్వడం అత్యంత ఆసక్తి రేకెత్తించిన అంశం. మహేష్ వాయిస్‌లో ముఫాసా పాత్రను చూసేందుకు వెళ్లిన ప్రేక్షకులు కచ్చితంగా ఓ మంచి అనుభూతితో బయటికి వస్తారు. మహేష్ ఎంతో మనసు పెట్టి.. కథ-పాత్రలోని భావోద్వేగాలకు తగ్గట్లుగా అతను సంభాషణలు పలికిన విధానం 'ముఫాసా' తెలుగు వెర్షన్ ప్రత్యేకత. ఇక దృశ్యపరంగా 'ముఫాసా' ఒక విజువల్ వండర్ అనిపిస్తుంది. యానిమేటెడ్ మూవీ అనే భావన రాకుండా సహజత్వం ఉట్టిపడేలా ఈ కథకు దృశ్యరూపం ఇచ్చిన తీరు కూడా అబ్బురపరుస్తుంది. ఐతే ఇవన్నీ బాగానే ఉన్నా.. ఒక భిన్నమైన కథను చూడాలని ఆశించే ప్రేక్షకులను మాత్రం ఇది నిరాశపరుస్తుంది. చిన్నతనంలో తల్లిదండ్రులకు దూరమయ్యే ఓ కొడుకు.. ఆ బిడ్డను చేరదీసి తన కొడుకుతో పాటు ఇంకో బిడ్డలా పెంచే ఓ తల్లి.. ఆ అనాథ అంటే అస్సలు నచ్చని తండ్రి.. ఇలా 'ముఫాసా'లోని పాత్రలన్నీ మనుషులను పోలినట్లే ఉంటాయి. వాటి మధ్య సన్నివేశాలు.. ఎమోషన్లు అన్నీ కూడా సగటు ఫ్యామిలీ డ్రామాను తలపిస్తాయి. విజువల్‌గా ఎంత మెప్పిస్తున్నప్పటికీ.. కథగా మాత్రం 'ముఫాసా' ఏ దశలోనూ ఎగ్జైట్ చేయదు. విలన్‌తో హీరో గొడవ.. వారి మధ్య పోరాటం కూడా చాలా సాధారణంగా అనిపిస్తుంది. కథలో బలమైన ఎమోషన్ లేకుండా విజువల్‌గా ఎంత మాయాజాలం చేసినా మనసు నిండదు. ఇందులో కథ కూడా ఒక తీరుగా నడవదు. అసలు హీరో సరైన లక్ష్యాన్ని నిర్దేశించే ప్రయత్నమే జరగలేదు. తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ రేకెత్తించని విధంగా సాగే కథనం బోర్ కొట్టిస్తుంది. అక్కడక్కడా కొన్ని ఎపిసోడ్లు బాగున్నా.. కథ పరంగా మాత్రం ఎగ్జైట్మెంట్ కలిగించదు 'ముఫాసా'. అసందర్భోచితంగా.. విసుగు పుట్టించేలా పెట్టిన పాటలు సినిమాకు పెద్ద మైనస్. అవేమైనా వినసొంపుగా ఉన్నాయా అంటే అదీ లేదు. డైలాగులనే పాట రూపంలో ఎలా పడితే అలా పాడించేశారు. ఐతే డైలాగులు మాత్రం భలే గమ్మత్తుగా అనిపించేలా ఆసక్తికరంగా రాశారు. చాలాచోట్ల సంభాషణల్లో చమత్కారం కనిపిస్తుంది. బ్రహ్మానందం-ఆలీ-జబర్దస్త్ శేషు గాత్రదానం చేసిన పాత్రలతో బాగానే నవ్వించగలిగారు. విలన్ పాత్రకు అయ్యప్ప పి.శర్మ చెప్పిన డబ్బింగ్ కూడా బాగుంది. ముఫాసా పాత్ర అనుకున్నంత బలంగా లేకపోయినా.. మహేష్ వాయిస్ ద్వారా దాని లోపాలను కొంత కవర్ చేశాడు. మొత్తంగా చెప్పాలంటే 'ముఫాసా' దృశ్యపరంగా మెప్పించినా.. కథాకథనాల్లో మాత్రం నిరాశపరుస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో..

### కథ:

పెద్ద సింహం కొడుకైన ముఫాసా చిన్నప్పట్నుంచి చాలా చురుగ్గా ఉంటాడు. వేగంలో.. తెలివిలో తనకు తానే సాటి. ఐతే ఓ వరదలో కొట్టుకుపోయి తల్లిదండ్రులకు దూరమైన ముఫాసా.. దూరంగా వేరే రాజ్యంలో అనాథలా పెరుగుతాడు. ఆ రాజ్యానికి అధిపతి అయిన ఒబాసికి ముఫాసా అంటే అస్సలు ఇష్టం ఉండదు. కానీ అతడి భార్య-కొడుకు.. ముఫాసాను చేరదీస్తారు. ముఫాసా పెరిగి పెద్దయ్యాక కూడా ఒబాసి మీద అయిష్టత తగ్గదు. అలాంటి సమయంలోనే ప్రమాదకర తెల్ల సింహాలు ఒబాసి భార్య మీద దాడి చేస్తాయి. ఆ దాడి నుంచి కాపాడే ప్రయత్నంలో ఆ తెల్లసింహాల రాజు కొడుకును ముఫాసా చంపేస్తాడు. దీంతో రాజు అతడిపై కక్షగట్టి అతడి వాళ్లందరినీ అంతం చేయడానికి బయల్దేరతాడు. మరి తెల్లసింహాల నుంచి ముఫాసా తప్పించుకున్నాడా.. వాటితో పోరాడి గెలిచాడా.. ఇంతకీ తన తల్లిదండ్రులు ఏమయ్యారు.. వారిని ముఫాసా కలుసుకున్నాడా లేదా అన్నది మిగతా కథ.

అద్భుతమైన విజువల్ ఎఫెక్టుల మధ్య 'ముఫాసా' చూస్తున్నంతసేపూ నిజంగా మనం ఓ అడవిలో జంతువుల మధ్య సంచరిస్తున్న భావన కలుగుతుంది. ఎక్కడా అసహజంగా అనిపించకుండా చక్కగా కుదిరిన విజువల్ ఎఫెక్టులు సినిమాకు ప్రధాన ఆకర్షణ కాగా.. యానిమేటెడ్ రూపంలో జంతువుల్ని సృష్టించి.. వాటితో డైలాగులకు తగ్గట్లుగా హావభావాలు పలికించిన తీరు కూడా ఆకట్టుకుంటుంది. పలికే ప్రతి మాటకు తగ్గట్లుగా జంతువుల హావభావాలు చూస్తుంటే.. అవి నిజమైన జంతువు లేనా.. వాటికి నిజంగానే మాటలు వచ్చేశాయా అన్న భ్రమలు కలగడం ఖాయం. ఐతే కేవలం విజువల్ ఎఫెక్టులతో కంటికి ఇంపైన దృశ్యాలు చూపించి పంపేయకుండా కొంచెం భిన్నమైన.. ఆసక్తికరమైన కథను చెప్పడానికి ప్రయత్నించి ఉంటే బాగుండేది. బలమైన ఎమోషన్ లేని ఒక మామూలు కథతోనే సరిపెట్టేయడం నిరాశ పరుస్తుంది.

## సుకుమార్ సినిమాలు మానేస్తున్నారా?



లెక్కల మాస్టర్.. ఆయనేనండీ డైరెక్టర్ సుకుమార్.. రచయితగా ఎంట్రీ ఇచ్చిన సుక్కూ మాస్టర్.. ఆ తర్వాత డైరెక్టర్ మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు స్టార్ డైరెక్టర్ గా మారారు. పుష్ప సిరీస్ చిత్రాల తర్వాత పాన్ ఇండియా లెవెల్ లో సెన్సేషనల్ డైరెక్టర్‌గా అవతరించారు. వేరే లెవెల్‌లో ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. సుకుమార్.. అంటే ఓ బ్రాండ్ అని ప్రూవ్ చేసుకున్నారు. అల్లు అర్జున్ తో ఆర్య సినిమా చేసి డైరెక్టర్ గా డెబ్యూ ఇచ్చిన సుకుమార్.. తన ఫస్ట్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. అప్పటి వరకు ఎవరూ తీయని విధంగా లవ్ స్టోరీ తెరకెక్కించి ప్రశంసలు అందుకున్నారు. తన టేకింగ్ రూటే వేరు అన్నట్లు మెప్పించారు. రెండో సినిమా రామ్ పోతినేనితో జగడం చేశారు. విభిన్నమైన మూవీగా వచ్చిన ఆ సినిమాతో అనుకున్న స్థాయిలో ఆకట్టుకోలేకపోయారు. ఇక రీసెంట్‌గా పుష్ప-2తో ప్రభంజనం సృష్టించారు. మూడేళ్లపాటు కష్టపడ్డ ఆయన.. అందుకు తగ్గ ప్రతిఫలం అందుకున్నారు. రూ.1000 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టారు. సినిమా రిలీజ్ అయ్యి 15 రోజులు దాటినా.. ఇంకా వసూళ్ల వర్షం కురిపిస్తూనే ఉంది. మూవీలో ప్రతీ సీన్ ను చెక్కే సుకుమార్.. నెక్స్ట్ చరణ్ తో రెండోసారి వర్క్ చేయనున్నారు. ఇప్పటికే అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. దీంతో చరణ్, సుకుమార్ ప్రాజెక్ట్ పై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయిపోయాయి. అదే సమయంలో ఆయన రీసెంట్‌గా కామెంట్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అందులో తాను సినిమాలు వదిలేస్తానని చెప్పడంతో అంతా షాక్ అయిపోతున్నారు. అసలు సుక్కూ మూవీస్ వదిలేయడమేంటని నెటిజన్లు డిస్కస్ చేసుకుంటున్నారు. రామ్ చరణ్ అప్ కమింగ్ మూవీ గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ రీసెంట్‌గా యూఎస్ లో జరగ్గా.. సుకుమార్ చీఫ్ గెస్ట్ గా వెళ్లారు. ఆ సమయంలో సుకుమార్ గారు.. డోప్ అని చెప్పి వదిలేయాలంటే దేన్ని వదిలేస్తారని యాంకర్ సుమ ప్రశ్నించారు. దీంతో ఆయన సినిమా అని ఆన్సర్ ఇచ్చారు. దీంతో అక్కడే ఉన్న రామ్ చరణ్ సహా అంతా షాకయ్యారు. నిజానికి డోప్ అంటే వదిలిపెట్టడం అని మీనింగ్ అంట. మరి సుకుమార్ అలా ఎందుకు చెప్పారో తెలియదు కానీ.. ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో..





ఏ అంశంపైనైనా ప్రేమలో పడ్డారో.. అది ఏ పనైనా చేయిస్తుంది. యూఎస్‌లో మంచి జీతాన్ని వదులుకుని చెట్టూ, పుట్టా, గుట్టా అంటూ వన్యప్రాణుల ఫోటోల కోసం ఇండియాకు తిరిగివచ్చిన ఫోటోగ్రాఫర్ సుయాష్ కేసరీది అదే తరహా. 19 ఏళ్లకే తానంతగా ఇష్టపడి ప్యాషన్ పెంచుకున్న ఫోటోగ్రఫీలో నేచర్స్ బెస్ట్ ఫోటోగ్రఫీ ఆసియా అవార్డునందుకుని, దాన్నేకంగా వాషింగ్టన్ డీసీలోని స్మిత్సోనియన్ నేచురల్ హిస్టరీ మ్యూజియంలోనూ ప్రదర్శించే స్థాయికెదిగిన ఆ ఛాయాచిత్రకారుడి కథకు ఓ ఆడ పులిపిల్ల స్ఫూర్తంటే మీరు నమ్మగలరా?

# ఓ ఫోటోగ్రాఫర్ సక్సెస్ వెనుక.. పులిపిల్ల..!



మధ్యప్రదేశ్‌కు చెందిన సుయాష్ కేసరికి ప్రకృతన్నా, వన్యప్రాణులన్నా ఎనలేని ప్రేమ. బాంధవ్‌ఘర్ నేషనల్ రిజర్వ్ పార్క్‌లో సోలో పేరుతో ఉన్న ఓ ఆడపులి అసహజ మరణం సుయాష్‌ను కలిచివేసింది. అప్పటికే ఓ టీవీ ఛానెల్‌లో ప్రెజెంటర్‌గా, వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్న సుయాష్.. ఆ ఆడపులి మరణంతో కొంతకాలం తన వృత్తికి కూడా విరామమిచ్చాడు. ఎందుకంటే ఆ పులితో సుయాష్‌కు ఏర్పడిన అనుబంధమే అందుకు ప్రధాన కారణం. ఎనిమిదేళ్ల క్రితం బాంధవ్‌గఢ్‌లో ఆ పులి పిల్ల జన్మించిన్నాట్నుంచీ.. పెరిగి పెద్దదై మిగిలిన పులులతో ఫైటింగ్ చేసే వరకూ వివిధ రకాల సోలో టైగ్రెస్ ఫోటోలను తన కెమెరాలో బంధించిన అనుభవంతో పాటు.. ఆ క్రమంలో ఏర్పడిన అనుబంధమే.. సుయాష్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది.

"సోలో.. నీది నా జీవితంలో చాలా కీలకపాత్ర. నేను నీతో ఎన్ని లెక్కలేని గంటలు గడిపానో నాకే గుర్తులేదు. ముందు నిన్ను నా కెమెరాలో బంధించడానికి నీ గురించి తెలుసుకునే యత్నం చేశా. ఆ తర్వాత నీ నుంచే నేను చాలా నేర్చుకున్నా. ప్రేమ, ఆప్యాయత, కుటుంబం, ధైర్యం వంటి ఎన్నో లక్షణాలను నేను నీ నుంచి తెలుసుకున్నా" అంటూ తన సోషల్ మీడియా టైమ్ లైన్స్‌పై కూడా పోస్టింగ్స్ చేశాడు సుయాష్.



అయితే ఎందుకు సోలో అంటే సుయాష్‌కు ప్రత్యేక ప్రేమ. అంటే తన 25 ఏళ్ల ఫోటోగ్రఫీ జీవితంలో సోలోది ఎంతో కీలకపాత్ర. "సఫారీ విత్ సుయాష్" పేరుతో సుయాష్ రూపొందించిన ఐదు భాగాల సీరిస్‌లో సోలోనే లీడ్ రోల్ కాగా, ఈ సీరీస్ తన సోషల్ మీడియా సైట్స్ ద్వారా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) దృష్టిలో పడింది. ఆ తర్వాత ఆ సీరీస్ కొనసాగింపునకు డబ్ల్యూడబ్లూఎఫ్‌యే ఫండ్స్ కేటాయించగా, వన్యప్రాణి పరిరక్షణ ఎంత అవసరమో జనం కళ్లు తెరిపించేలా ఆ సీరీస్ తన థర్డ్ ఐతో రూపొందించాడు సుయాష్. అదే సుయాష్‌కు తర్వాతి రోజుల్లో యానిమల్ ప్లానెట్ ఛానెల్‌లో అతి పిన్నవయస్సులో ప్రెజెంటర్ అవకాశాన్ని కూడా తెచ్చిపెట్టింది. అంతేకాదు మొదట చెప్పుకున్నట్టుగా 19 ఏళ్ల వయస్సులో ఆ ఆడపులి పిల్లను తీసిన ఫోటోలకే సుయాష్‌కు నేచర్స్ బెస్ట్ ఫోటోగ్రఫీ ఆసియా అవార్డును తెచ్చిపెట్టింది. ఆ ఫోటోనే ఫోటోగ్రాఫర్స్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే వాషింగ్టన్ డీసీలోని స్మిత్సోనియన్ నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ఒక సంవత్సరం పాటు ప్రదర్శించబడింది.

## "వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై తనలో అవగాహన పెంచింది జూ అంటాడు సుయాష్"

చాలామంది పిల్లలు టామ్ & జెర్రీ వంటి కార్టూన్‌లను చూడటానికి, నేటి పిల్లలైతే మొబైల్ గేమ్స్ ఆడటానికో ఇష్టపడతారు. కానీ సుయాష్ మాత్రం తన బాల్యమంతా డిస్కవరీ, యానిమల్ ప్లానెట్ వంటి ఛానెల్స్‌లో జంతువులు, పర్యావరణ వ్యవస్థ వంటివాటినే చూసుకుంటూ పెరిగాడు. దాంతోపాటే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో నివసించిన సమయాల్లో ఎక్కువగా జాతీయ పార్కులు, జంతు ప్రదర్శనశాలలను సందర్శించడంతో సుయాష్‌కు జంతువుల పట్ల వల్లమాలిన ప్రేమ ఏర్పడింది. కోల్‌కత్తాలోనూ తన తల్లిదండ్రులతో వేసవి సెలవుల్లో గడిపేందుకు వెళ్లినప్పుడు కూడా.. అలీపూర్‌లోని జూపార్కుకు తరచూ వెళ్తుండేవాడు. అలా జూలలో పులులను బోనుల్లో చూసి చప్పట్లు కొట్టే సందర్భంలో అవి తిరిగి చూస్తున్నప్పుడు.. సుయాష్ తాత వాటి సహజ నివాసాలు అడవులని చెప్పిన మాటలు సుయాష్ ఆరేడేళ్ల వయస్సులోనే ఆయన మనస్సులో నాటుకున్నాయి. పంజరాలు జైళ్లవంటివన్న ఆలోచనతో ఆయనలో వన్యప్రాణుల పట్ల దృక్పథం మారిపోయింది. కొన్ని సంవత్సరాల తర్వాత సుయాష్ తన తండ్రి కెమెరాను ఉపయోగించి జంతువుల చిత్రాలను క్లిక్ చేయడం ప్రారంభించాడు. బేర్ గ్రిల్స్, నిగెల్ మార్వెన్, క్రిస్ ప్యాక్‌హామ్ వంటి ఫోటో ప్రెజెంటర్స్‌ను ఫాలో అవుతూ మెలమెల్లగా ప్రేరణ పొందేవాడు. భారత్ అడవుల్లోని వన్యప్రాణులను విదేశీ ఫోటోగ్రాఫర్స్ వచ్చి అందంగా బంధించి ప్రపంచానికి చూపెడుతున్నప్పుడు మనం భారతీయులం మాత్రం ఆ పని ఎందుకు చేయకూడదన్న కసి సుయాష్‌లో మరింత పెరిగింది.

## 'ఆదిలో అంత ప్రోత్సాహమూ దక్కకపోగా నిరాశే ఎదురైంది.'

17 సంవత్సరాల వయస్సులో సుయాష్ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ వృత్తినెంచుకుని అడవుల్లో అన్వేషణకు బయల్దేరాడు. కానీ వన్యప్రాణి సంరక్షకులు, అటవీశాఖ అధికారులు, ఇతర అధికారుల నుంచి కెరీర్ మొదట్లో ఏమాత్రం ప్రోత్సాహం లభించకపోగా.. ఈ ఫీల్డ్ శుద్ధ దండగనీ ముఖం మీదే చెప్పేశారు. ఎలాంటి డబ్బులు ఆశించకుండా, మీరిచ్చే సర్టిఫికెట్స్ వంటివి కూడా అవసరం లేకుండా మీరేది చెబితే అది చేస్తూ.. ఇంటర్న్‌షిప్ చేస్తానని చెప్పినా అధికారులు ససేమిరా అనడంతో సుయాష్ రూట్ మారింది. అలా తన అభిరుచిని విడిచిపెట్టి.. పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్‌ని అభ్యసించడానికి యూఎస్ బాట పట్టాడు సుయాష్. తను ఒక మంచి స్థిరమైన ఉద్యోగంలో సెటిలై.. కాస్తోకూస్తో సంపాదించుకున్న తర్వాత తాననుకున్న ఫీల్డ్‌లో మళ్లీ ప్రయత్నం మొదలెట్టాలన్న ఆశను మాత్రం సుయాష్ వదులుకోలేదు.

## అసలు ఎలా వెలుగులోకొచ్చాడు?

చాలామందిలాగే.. సుయాష్ కూడా సోషల్ మీడియా స్యావీ. తన విద్యాభ్యాస కాలం నుంచే తను క్లిక్ చేసిన ఫోటోలను శీర్షికలతో సహా పోస్ట్స్ పెడుతూ మన్ననలందుకునేవాడు సుయాష్. యువత చిన్నగా, ఫన్నీగా ఉండే క్యాప్షన్‌తో కూడినవాటిని ఎక్కువ ఇష్టపడటాన్ని గమనించిన సుయాష్ తన ఫోటోలకూ అలాంటి శీర్షికలే పెట్టడం వల్లే నెటిజనం స్పందనందుకున్నట్టు చెబుతాడు. అలా తన క్లిక్కులకు లైకులు, కామెంట్స్, షేర్స్ రూపంలో వస్తున్న స్పందనలతో మెల్లిగా సఫారీ విత్ సుయాష్ సీరీస్ తయారు చేయాలనే కోరికకు అంకురార్పణ జరిగింది.

మధ్యప్రదేశ్ స్థానికుడైన సుయాష్‌కు చిన్ననాటి నుంచే పరిచయమున్నను బాంధవ్‌గర్ నేషనల్ రిజర్వ్ పార్కునే తన సీరిస్ నిర్మాణం కోసం కేంద్రంగా ఎంచుకున్నాడు. కొందరు స్పాన్సర్స్, రచయితలతో కలిసి అక్టోబర్ 2018లో సిరీస్‌ని చిత్రీకరించాడు. ఏదో కనిపించిన జంతువునల్లా ఫోటోలు కొట్టుకుంటూ వెళ్లడం కాకుండా.. ఓ క్రమపద్ధతిలో అద్భుతమైన స్టోరీ నేరేషన్‌తో ఉండేలా అటవీశాఖ నిపుణులు, కొందరు కథా రచయితల సహకారాన్నీ తీసుకున్నాడు. అంతేకాదు ఆ క్రమంలో పలు పుస్తకాలు చదవటం, యూట్యూబ్ వైల్డ్ లైఫ్ ఛానల్స్‌ను వాచ్ చేయడం వంటివి చేస్తూ.. మొత్తంగా ఓ అద్భుతమైన వైల్డ్ లైఫ్ దృశ్యకావ్యాన్ని సీరిస్ రూపంలో తీసుకొచ్చాడు సుయాష్.

## డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌ను ఆకట్టుకోవడంతో మారిన దశ

సుయాష్ సోషల్ మీడియా కంటెంట్‌ని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ చూసింది. తను తన పోస్టులను ట్యాగ్ చేస్తుండటం వల్ల వారి దృష్టిలో పడటంతో పాటు.. వారికి సుయాష్ ఫోటోగ్రాఫ్స్‌లో సుమారు 200 ఫోటోలు బాగా నచ్చాయి. దాంతో వారు రంగంలోకి దిగి సుయాష్‌ను సంప్రదించారు. వారికి సుయాష్ సీరీస్ కాన్సెప్ట్ నచ్చడంతో స్పాన్సర్‌షిప్ అందించడానికీ ముందుకొచ్చారు. అయితే సుయాష్ ధారావాహికంలో తానెంతగానో ఆరాధించిన సోలో అనే ఆడపులి కథనే ప్రధాన ఘట్టమైంది. వేట.. మానవులకు, జంతులకు మధ్య నెలకొన్న సంఘర్షణ.. అటవీ నిర్మూలన.. ప్రభుత్వ నష్టపరిహారం వంటి అనేక రకాల అంశాలను స్పృశించేలా సఫారీ విత్ సుయాష్ సీరిస్ క్లిక్కైంది. అలా సీరీస్‌లో ఐదు భాగాలను తీసుకురాగా.. దక్షిణాఫ్రికాలో సింహాలు, ఖడ్గమృగాలు, ఇతర అటవీ జంతువుల ఆధారంగా.. రెండో సిరీస్‌ను రూపొందించారు.

సుయాష్ ఫోటోగ్రఫీపై ఏర్పర్చుకున్న అభిరుచితో ఇప్పటికే 23 దేశాలకు పైగా తిరిగాడు. కేవలం వంద నుంచి 200 మీటర్ల దూరం నుంచి వన్యప్రాణులను కెమెరాలో బంధించగల్గే నేర్పరితనం ఇప్పుడు సుయాష్ సొంతం. తన వాహనాన్ని ఎప్పుడు కూడా వాటి పొలిమేరల్లోకి తీసుకెళ్లకుండా వాటిని గౌరవిస్తూ జాగ్రత్తపడటంతో పాటు అవి దగ్గర్లోకొచ్చే వరకూ కూడా క్లిక్కుల కోసం నిరీక్షిస్తానంటాడు సుయాష్. అంతేకాదు తనకు అడవుల్లో సహకరించేవారందరికీ ఏదో ఓ రకమైన సాయమందిస్తుంటాడు. అటవీశాఖ అధికారులకు బూట్లివ్వడం, అటవీప్రాంతంలోని గిరిజనుల కోసం సోలార్ ల్యాంప్స్‌ను అందించడం, అక్కడి పిల్లల విద్యకు తగిన ప్రోత్సాహన్నిందించడం వంటివెన్నో చేస్తూనే.. తనకిష్టమైన వృత్తిలో రాణిస్తున్నాడు సుయాష్. 2018లో 18 అడవి ఏనుగులు ఛత్తీస్‌గఢ్ నుంచి బాంధవ్‌గఢ్‌కు సురక్షితమైన నివాసం కోసం వలస వచ్చినప్పుడు.. అవి రైతుల పంటలను నాశనం చేశాయి. గ్రామస్థులు వాటిని భయపెట్టడానికి పటాకులు ఉపయోగించగా అవి ఎదురుతిరగడం తీవ్ర ఆందోళన రేపింది. ఆ సమయంలో సుయాష్, అతని బృందం జోక్యం చేసుకుని పొలాలను రక్షించడానికి కాక్టస్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయగా, ఇప్పుడు బాంధవ్ గఢ్ రిజర్వ్ ఫారెస్ట్‌లో దాదాపు 50 ఏనుగులున్నాయి. ***వన్యప్రాణి ప్రేమికుల కోసమే.. త్వరలోనే తన సొంత ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ను కూడా ప్రారంభించాలని ఆశిస్తున్నాడు సుయాష్. ఇదీ ఓ యంగ్ ఫోటోగ్రాఫర్‌కి తాను ప్రేమించిన వృత్తిపై తీరని దాహపు కథ! తనను క్లిక్కుమనిపించిన ఛాయాచిత్రకారుణి జీవితచిత్రాన్నే మార్చేసేలా ఇన్‌స్పైర్ చేసి కంట తడిపెట్టించి వెళ్లిపోయిన ఓ పులికథ!!***

- రమణ కొంటికర్ల

# శాంతినగర్ కాలనీలో వాజ్‌పేయి జయంతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శాంతినగర్ కాలనీ పోలింగ్ బూత్ 207లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు, పోలింగ్ బూత్ అధ్యక్షురాలు బలివాడ జాహ్నవి, భైరి అప్పారావు, గుగ్గిలాపు రామకృష్ణ, జలగడుగుల గోవింద్, బరాటం మెహర్, ఆకాశ్, ఆరంగి సతీష్ కుమార్, దుండంగి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666




అధికారులు కళ్లు మూసుకున్నారు.. పెత్తందారులు కాలువలు కప్పేశారు.. కొత్తూరు-శ్రీకాకుళం ప్రధాన రహదారి గుంతలమయం అయింది. సొంత

## అధికారులు స్పందించాలి..!

అవసరాల కోసం కొంతమంది కాలువను మూసేశారు. గత కొన్నేళ్లుగా ఇదే దుస్థితి. అధికారులు కళ్లు మూసుకొని ఉన్నారా? అని ప్రయాణీకులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సత్యంన్యూస్, కొత్తూరు

## ఎర్రముక్కాం-రాణిగం రోడ్డుకు

# మోక్షమెప్పుడో!?



(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

సోంపేట మండలం రాణిగం-ఎర్రముక్కాం రహదారి సుమారు 24 గ్రామాల ప్రజలకు జీవనాధారం. సామాన్య ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారి కొన్నేళ్లుగా గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం దీనికి తోడవడంతో మరింత దారుణంగా మారి ప్రయాణికులకు ఈ రహదారి వెంబడి ప్రయాణం శాపంగా మారింది. 'సంక్రాతికి ఊరికి వచ్చినవాళ్లు ఎవరైనా రోడ్లు బాగోలేవని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, దానికి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలను బాధ్యులను చేస్తాను.' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు స్ట్రాంగ్ వార్నింగ్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో ఈ రోడ్డు దిశ, దశ మారుతుందని స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఆ దిశగా సంక్రాంతికి ముందుగానే ఈ రహదారికి పండగ కళ వచ్చేలా 24 గ్రామాల్లో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎర్రముక్కాం తీర ప్రాంత పరిరక్షణ కన్వీనర్, పవన్‌కళ్యాణ్ అభిమాని బి.బాబూరావు కోరారు.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001


# పశువుల దాణా తినేశారు!

- రూ.11 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మాయం
- సరఫరా చేయకుండా బిల్లుల చెల్లింపు
- డీడీ కాదంటే ఏడీలతో సంతకాలు
- టీడీపీలో బీజం.. వైకాపాలో పంపకం

**పశు సంవర్ధక శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఉంటే.. దాన్నేం చేయాలి? సంబంధిత జిల్లాలో ఎస్సీ, ఎస్టీల జీవనోపాధి మెరుగుకు పశువులను కొనుగోలు చేసి ఇవ్వాలి. ఇందుకోసం కేటాయించిన నిధులతో వేరే రాష్ట్రానికి వెళ్లి ఎక్కువ పాలిచ్చే మేలుజాతి పశువులు కొనుగోలు చేస్తే మనకేం మిగులుతుందని అనుకున్నారో ఏమో.. పశువులకు దాణా ఇస్తే సరిపోతుందని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దాణా కొనుగోలుకు మళ్లించేశారు. సాధారణంగా పొలం గట్ల మీద, చెరువుల్లోను మేసే పశువులకు దాణా ఇచ్చేశామని రికార్డుల్లో రాసుకుంటే ఎంచక్కా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మింగేయొచ్చని, ఆ తర్వాత అడిగితే ఆ దాణా పశువులకు పెట్టేశామని చెప్పేయొచ్చన్నదే అసలు ప్లాన్. ఒక్క మాటలో చెప్పాలంటే బీహార్‌లో లాలూప్రసాద్ యాదవ్ చేసిన గడ్డి కుంభకోణం లాంటిదే ఇది కూడా. అంకెల్లోనే తేడా.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం 2017 నుంచి 2021 వరకు జిల్లాలో యదేచ్ఛగా సాగింది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేవలం దళితుల కోసమే ఖర్చు చేయాలి. అందుకు దళితులకు రెనోవేటెడ్ ఇన్‌పుట్ డెవలప్‌మెంట్ పేరుతో చూలు ఆవులు కొనుగోలు చేసి ఇవ్వాలని 2017-18 ఆర్థిక సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి సుమారు రూ.15 కోట్లు ఖర్చు చేయాలని ముందుగా నిర్ణయించింది. చూలు ఆవులు కొనుగోలు చేయడానికి సమయం పడుతుందని, దీనివల్ల ప్రభుత్వ ప్రయోజనం నెరవేరదని గుర్తించిన కొందరు ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు చూలు ఆవులు కొనుగోలు స్థానంలో పశువుల దాణా సబ్సిడీపై అందించాలని నిర్ణయించారు. అందుకోసం 2 లక్షల బస్తాలు (ఒక్కోటి 50 కేజీలు) అంటే కోటి కిలోల దాణాకు విజయవాడలోని శ్రీనివాస్ ఆయిల్ మిల్స్ ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. కేజీ రూ.16కు కొనుగోలు చేసి సబ్సిడీపై రైతులకు రూ.4కు అందించడం ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశం. జిల్లాలో 50వేల మంది రైతులను గుర్తించి ఒక రైతు



GOVERNMENT OF ANDHRA PRADESH
DIRECTORATE OF ANIMAL HUSBANDRY: VIJAYAWADA

Cir. Memo. Roc. No 8966/D/D2/2017. Dated. 28.11.2017.

Sub:- Animal Husbandry Department - Budget allocation for feeding support to SC/ST farmers - Certain guidelines issued - Regarding.

-o0o-

All the Joint Directors (AH), I/c. District Administration are instructed to follow the following guidelines for utilization of funds to provide feeding support to the animals of SC/ST farmers by supplying the TMR on subsidized rate.

- The Scheme is operated under the Head of Account: 2403-789-11-24-310-312 (SC Farmers) & 2403-796-11-21-310-312 (ST Farmers)
- The expenditure towards the implementation of scheme for SC/ST Sub Plan during the financial year shall be met from the funds released under the Head of Account 2403-789-11-24-310-312 (SC Farmers) & 2403-796-11-21-310-312 (ST Farmers).
- The Joint Directors are requested to utilize the funds allocated for the Scheduled Caste/Scheduled Tribes farmers only.
- The Joint Directors (AH) shall treat the targets communicated as Technical sanctions accorded and place the indent through RIDS app only indenting one truck load of TMR to a contiguous area for operational convenience.
- Each farmer is eligible for supply of maximum of 3000 kgs of TMR at a time which will be sufficient for a period of 60 days for 4 no. of animals.
- The Joint Directors shall utilize the funds completely under SCSP/TSP and submit the utilization certificate for the releases made under SCSP/TSP.

Sd/-Dr.G.Somasekharam
DIRECTOR

To
All the Joint Directors (AH), I/c. District Administration in the State.
Copy to AHIT Cell.
Copy to Stock File.

//true copy//
JOINT DIRECTOR (T&K)

పశువుల దాణా కోసం విడుదల చేసిన మార్గదర్శకాలు


కుటుంబానికి గరిష్ఠంగా 3వేల కేజీల దాణాను నాలుగు పశువులకు రెండు నెలల పాటు అందించడానికి నిర్ణయించారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని ఆయా పశువైద్య ఆసుపత్రుల పరిధిలో ఉన్న దళిత, గిరిజన రైతులు తమ వాటాగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. దీన్ని ఆయా పశు వైద్యాధికారులు ధ్రువీకరించి ఆర్ఐడీఎస్ యాప్ ద్వారా రైతులు కోరిన దాణాను ఇండెంట్ పెట్టాలి. ఇండెంట్ పెట్టిన దాణాను రైతులకు చేరువ చేయాలి. అయితే జిల్లాలో 10 శాతానికి మించి సరఫరా జరగలేదు. పశువుల దాణా జిల్లాకు తీసుకురాకుండానే తెచ్చినట్టు చూపించి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి.

### బ్లాక్ మార్కెట్‌కు తరలించారు

ఏజెన్సీలు 50 శాతం కమీషన్‌తో పశుదాణా సరఫరా చేయడం మొదటి నుంచి అలవాటు. దీన్నే ఆదాయ మార్గంగా చేసుకొని జిల్లాలో ఉన్న పశు సంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు కలిసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో కొనుగోలు చేసి సరఫరా చేయాలని నిర్ణయించిన పశుదాణాను జిల్లాకు రవాణా కాకుండానే బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారు. దాణాను పక్కదారి పట్టించడం కోసం పశు సంవర్ధక శాఖ అధికారులు మొదట్నుంచి ఓ పథకం ప్రకారం వ్యవహరించారు. దాణా ఇస్తారనే సమాచారం బయటపడకుండా గుట్టుగా వ్యవహారం నడిపారు. దీంతో దళిత, ఎస్టీ రైతులు మీ-సేవలో పేర్లు నమోదు చేసుకోలేదు. ఒకవేళ ఎవరైనా నమోదు చేసుకున్నా, వారి కంట్రిబ్యూషన్ 25 శాతం చెల్లించిన దాఖలాలు లేవు. కానీ వెయ్యి లారీల్లో 2 లక్షల బస్తాల దాణా సరఫరా చేసినట్టు రైతుల పేరుతో ఆర్ఐడీఎస్ యాప్‌లో నమోదు చేసి ఇండెంట్ పెట్టి సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారు. వాస్తవానికి జిల్లాలో దళిత, ఎస్టీల్లో 50వేల మందికి పశువుల దాణా పంపిణీ చేయాలి. దీన్ని ఆ శాఖ డైరెక్టర్ నుంచి క్షేత్రస్థాయిలో పశువైద్య అధికారుల వరకు దుర్వినియోగం చేసి కమీషన్లు పంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పోనీ నిబంధనల ప్రకారం పంపిణీ చేశారనుకున్నా 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి దాణా పంపిణీ పూర్తి కానట్లు తెలుస్తుంది. అయినా విజయవాడకు చెందిన శ్రీనివాస్ ఆయిల్ మిల్స్ ఏజెన్సీకి రూ.9 కోట్ల మేర చెల్లించేశారు. చివరిసారిగా 2019 మార్చి 5న 2.40 లక్షల కేజీల పశుదాణా అవసరమని ఆర్ఐడీఎస్‌లో ఇండెంట్ కూడా పెట్టారు.

### 2021లో బిల్లు చెల్లింపు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా 2018లో ఈ పథకం ప్రారంభించారు కాబట్టి అప్పటి ఉన్నతాధికారులు ఆపలేదు. ఇండెంట్ పెట్టిన దాణా రాలేదు కానీ.. దీనికి చెల్లించాల్సిన మొత్తం రూ.2.38 కోట్లు విజయవాడకు చెందిన శ్రీనివాస్ ఆయిల్ మిల్స్ ఏజెన్సీకి చెల్లించడానికి 2019 మార్చి 20న అప్పటి జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ సిద్ధమయ్యారు కానీ 2019 సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశుదాణా కుంభకోణంపై ఫిర్యాదులు అందడంతో రూ.2.38 కోట్లు చెల్లింపు తాత్కాలికంగా నిలిపేశారు. వైకాపా హయాంలో జిల్లాకు చెందిన డాక్టర్ అప్పలరాజు ఆ శాఖకు మంత్రిగా ఎంపిక కావడంతో చెల్లింపుల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. వైకాపా హయాంలో బకాయిలు చెల్లింపుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక జీవోను 2021లో తీసుకువచ్చారు. అందులో పశువుల దాణా సబ్సిడీ పంపిణీపై పరిశీలించి సక్రమంగా ఉందని నిర్ధారించిన తర్వాతనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. దీనికోసం డివిజన్లలో ఉన్న ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు పక్క డివిజన్‌లో రికార్డులు పరిశీలించి నిర్ధారించాలని మార్గదర్శకాలు విడుదల



GOVERNMENT OF ANDHRA PRADESH
ANIMAL HUSBANDRY DEPARTMENT.

From
Dr A Eswara Rao, B.V.Sc., & AH, PGDAEM
Joint Director
Animal Husbandry
Srikakulam.

To
The Director
Animal Husbandry Dept.,
Govt. of Andhra Pradesh
Vijayawada.

Lr.Roc.No.497/C/2019,dated 28/09/2019

Sir

Sub: Animal Husbandry Department – Srikakulam District – Supply of concentrate Cattle Feed to the eligible farmers on subsidized cost @ Rs. 4/- per Kg from SCPSC – 2019-20 – Submission of bills for Administrative sanction – Request – Regarding.

Ref: 1. Head Office Pro. Roc. No. 2354/NLM/TS/CF/SRKLM, dated. 20.03.2019.
2. This office Lr. Roc. No. 497/C/2019, dt. 26.07.2019 & 07.08.2019.

I submit to state that vide reference 1st cited, the Director of Animal Husbandry, A.P., Vijayawada has accorded technical sanction for 2131.85 MTs of Cattle Feed to supply to the eligible SC farmers under SCPSC during the year 2019-20.

Further I submit that as per the technical sanction received vide reference cited and as per the indents placed by this office, **M/s Srinivasa Oil Mills, Moosapudi** has supplied the Cattle Feed to Srikakulam district out of RIDS along with the invoices to effect the payment to the firms.

| S.No | Invoice No. & Date | Quantity (in Mts) | Total Amount (in Rs.) | Subsidy (in Rs.) | Non Subsidy (In Rs.) |
|---|---|---|---|---|---|
| 1 | CF0195/2019-20, dt. 05.06.2019 | 618 | 93,75,060/- | 69,03,060/- | 24,72,000/- |
| 2 | CF0373/2019-20, dt. 20.07.2019 | 665 | 1,00,88,050/- | 74,28,050/- | 26,60,000/- |
| 3 | CF0489/2019-20, dt. 24.07.2019 | 320 | 48,54,400/- | 35,74,400/- | 12,80,000/- |
| | TOTAL | 1603 | 2,43,17,510/- | 1,79,05,510/- | 64,12,000/- |

I also submit that vide reference 2nd cited, administrative sanction proposals were already submitted to the head office. **The beneficiary list is here with submitted for favour of kind perusal.**

This is submitted for favour of information and necessary action.


Yours Faithfully

JOINT DIRECTOR (A.H)
SRIKAKULAM.

Encl: - Beneficiary List.

DATE 30/09/2019
DISPATCHED

బకాయి బిల్లు చెల్లింపునకు జేడీ ఇచ్చిన ఉత్తర్వులు



చేశారు. రాష్ట్రంలో అక్రమాలు జరిగినట్టు నిర్ధారణ అయిన శ్రీకాకుళం, కృష్ణా జిల్లాలతో పాటు మరో రెండు జిల్లాల్లో డీడీలు ఎవరూ బకాయి బిల్లు చెల్లింపులపై నిర్ణయం తీసుకోలేదు. అయితే ఇక్కడ మాత్రం డీడీల స్థానంలో ఏడీలతో సంతకాలు చేయించి బిల్లు చెల్లింపులకు క్లియరెన్స్ ఇచ్చేశారు. దీనిపై శాఖ డైరెక్టర్ బకాయి బిల్లులు చెల్లింపులకు సంబంధించిన ఫైల్‌పై డీడీల స్థానంలో ఏడీలు సంతకాలు చేయడంపై ఆక్షేపించినా శ్రీనివాస్ ఆయిల్ మిల్స్ ఏజెన్సీకి రూ.2.38 కోట్లు చెల్లించేశారు.

ఇటీవల దళిత సంఘాలు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై జేసీ త్రీమెన్ కమిటీ వేసి నివేదిక ఇవ్వాలని కోరారు. ఆయన త్రీమెన్ కమిటీ వేస్తున్నట్టు ప్రకటించిన తర్వాత పశు సంవర్ధక శాఖ జేడీ ఇన్‌ఛార్జిగా ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజగోపాలరావును నియమిస్తూ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేయడం కొసమెరుపు. ఈ కుంభకోణం వెలుగు చూడకుండా మేనేజ్ చేయడానికే ఈయన్ను నియమించినట్టు దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**అసలు ఈ కుంభకోణం వెనుక ఎవరున్నారు? ఎవరు చెబితే టీడీపీ హయాంలో కుంభకోణానికి తెరలేపారు? ఎవరి పాత్ర వల్ల వైకాపా హయాంలో బిల్లులు చెల్లించేశారు? ఇప్పుడు నిజంగా ఇవి బయటపడకుండా ఉండేందుకే ఆరోపణలున్న జేడీని ఇక్కడ నియమించారా? వీటన్నిటిపై మరో కథనంలో కలుద్దాం.**

## శాంతినికేతన్‌లో గుడ్ గవర్నెన్స్ డే




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో గుడ్ గవర్నెన్స్ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ గవర్నెన్స్ అంటే నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలుచేయడం, సుపరిపాలన అంటే దేశ ఆర్థిక, సామాజిక వనరుల నిర్వహణలో అధికారాన్ని సక్రమంగా, సమర్థవంతంగా ఉపయోగించుకోవడమని అన్నారు. పౌర కేంద్రీకృత పరిపాలన సుపరిపాలన పునాదిపై ఆధారపడి ఉంటుందన్నారు. సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ పాలనలో ప్రతిఒక్కరి భాగస్వామ్యాన్ని నిర్ధారించడం, దీని కింద పౌరులు తమ అభిప్రాయాలను చట్టబద్ధమైన సంస్థలు లేదా ప్రజా ప్రతినిధుల ద్వారా వ్యక్తం చేసే అవకాశాన్ని పొందాలన్నారు. శాంతినికేతన్ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్, ఎన్.అప్పలరాజు మాట్లాడుతూ కనీస వనరులు అందరికీ అందుబాటులో ఉండేలా ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకోవడం సుపరిపాలనలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్స్ అరుగుల దిలీప్ కుమార్, మట్ట ప్రియాంక, గార మౌనిక, యువతీ యువకులు పాల్గొన్నారు.

## మండవిల్లికి మాతృవియోగం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా నాయకుడు మండవిల్లి రవి మాతృమూర్తి తాయారమ్మ అనంత పల్లివారి వీధిలోని నివాసంలో గుండె పోటుతో బుధవారం ఉదయం కన్నుమూశారు. తాయారమ్మ అంత్యక్రియలను డే అండ్ నైట్ వద్ద గల రోటరీ స్వర్గధామంలో నిర్వహించారు. ఆమె మృతదేహానికి మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, యువనాయ కులు మెంటాడ స్వరూప్, అంధవరపు ప్రసాద్, వాణిజ్యవేత్త ఊణ్ణ నాగరాజు తదితరులు నివాళులర్పించారు.

## ఏపీఎంఈయూ జెండా ఆవిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రిమ్స్ ఆవరణలో యూనియన్ జెండాను విశ్రాంత రేడియాలజిస్ట్ జి.ఈశ్వరరెడ్డి విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ఆవిర్భావం, యూన్యన్ ద్వారా సాధించిన విజయాలను వివరించారు. యూనియన్ నాయకులు ఎన్.మాధవరావు, ఎ.కన్నంనాయుడు, డి.సింహాచలం సంఘం కార్యకలాపాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, మెడికల్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

## ఒడిశా గవర్నర్‌కు మంత్రి అచ్చెన్న శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఒడిశా గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకులు కంభంపాటి హరిబాబుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దున ఉన్న ఒడిశాకు ప్రథమ పౌరుడిగా ఆయన నియామకం కావడం గర్వకారణమని అన్నారు. తన అన్నయ్య దివంగత కింజరాపు ఎర్రన్నాయుడుకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. విశాఖ ఎంపీగా ఆయన గతంలో పని చేశారని, ఆ సందర్భంలో ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేశారని కొనియాడారు. సరిహద్దు రాష్ట్రం ఒడిశాకు ఆయన గవర్నర్‌గా ఉండడంతో పలు సమస్యల పరిష్కారానికి, ఇరు రాష్ట్రాల అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సాగునీటి సమస్యల పరిష్కారం ఆయనతోనే సాధ్యమవుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. మన రాష్ట్రానికే చెందిన వ్యక్తికి ఇరు ప్రాంతాల భౌగోళిక రాజకీయ అవగాహన ఉన్న వ్యక్తికి ఇంతటి గౌరవం దక్కడంపై హర్షం తెలిపారు.



## విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని సిటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని పరిరక్షించాలని, చండీఘర్ విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చండీఘర్ విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా సిటు రాష్ట్రకమిటీ పిలుపులో భాగంగా శ్రీకాకుళంలో విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిటు జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, డి.సుధ, ఆర్.ప్రకాష్, పి.గోవర్ధనరావు, కె.కళ్యాణి, పి.లత, నాయకులు ఎం.లలిత, వి.హేమలత, కె.సుజాత, ఎల్.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 18, 19, 20 తేదీల్లో సీనియర్ మెన్ బాక్సింగ్ టోర్నమెంట్ పిఠాపురంలో జరిగింది. ఈ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీహెచ్ జ్ఞానేశ్వర్‌రావు, పి.అప్పలరాజులు గోల్డ్‌మెడల్, పి.విశ్వేశ్వరరావు, ఎం.లోకేష్, ఎస్.ఏసు, కె.శ్రీకాంత్, డి.మనోజ్ కుమార్‌లు సిల్వర్ మెడల్‌లు ఆర్.హేమంత్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించి ఓవరాల్ ఛాంపియన్షిప్-2ని కైవసం చేసుకున్నారు. పథకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే గొండు శంకరరావు బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వర బాక్సింగ్ క్లబ్ ప్రెసిడెంట్ బలగ సీతారామ్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వంగ మహేష్, జిల్లా బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో చలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నిరాశ్రయులకు డాక్టర్ ఇంజరాపు మోహనరావు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. బొంపాడవీధి, అరసవల్లి సత్యసాయి మందిరం, అమ్మవారి గుడి దగ్గర ఉన్న నిరాశ్రయులకు దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రంగా ఉండటంతో ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారికి ఇబ్బంది కలుగుతుందన్నారు. అలాగే హార్ట్‌స్ట్రోక్‌లు కూడా వయసు మళ్లినవారికి వచ్చే ప్రమాదం ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిలి రమణ, వైశ్యరాజు మోహన్, మైగాపు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.